## క్లుప్తంగా

### ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

**బనగానపల్లె రూరల్:** నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, నేవేద్యం సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించి పల్లకీపై ఆశీనులు చేశారు. ఆలయ ప్రాకారంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్యులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్:** స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్డీఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌తో కలిసి ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందే వైద్య సేవలపై సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, వైద్యులు, సిబ్బంది కొరత తదితర సమస్యల గురించి ఆరా తీశారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

### శుభకార్యం



వైఎస్సార్‌సీపీ నాయకులతో కాటసాని రామిరెడ్డి

**అవుకు:** మండల పరిధిలోని రామాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బల మదన గోపాల్‌రెడ్డి సోదరుడు మహేశ్వర్‌రెడ్డి కుమార్తె కేశఖండన కార్యక్రమానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం గ్రామానికి చెందిన పార్టీ నాయకులతో మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యుడు పేరం వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భ్రమరాంబాదేవికి ఊయలసేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

**శ్రీశైలంటెంపుల్:** అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలంలోనీ అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రమోషన్ కమిటీ (డీఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 65 దరఖాస్తులు అందగా సింగిల్ డిస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 53 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న 12 దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలోగా తగిన పరిష్కారం అందించాలన్నారు. పరిశ్రమలకు అందజేయాల్సిన ప్రోత్సాహకాలకు సంబంధించి పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ విద్యుత్తు, సేల్ టాక్స్ తదితర రైతుల క్రింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగంలోని 16 యూనిట్లకు 31.85 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, ఎల్‌డీఎం రవీందర్ కుమార్, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ పాల్గొన్నారు.

# రైతుకు 'సేవలు' దూరం

- నియోజకవర్గంలో అలంకార ప్రాయంగా రైతు సేవా కేంద్రాలు
- నిరుపయోగంగా కియోస్క్‌లు
- అన్నదాతకు అందని పథకాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా పనిచేసిన ఆర్బీకేలు

**పది మందికి అన్నం పెట్టే రైతు** సంక్షేమాన్ని కాంక్షిస్తూ గత ప్రభుత్వం అనేక సంస్కరణలు చేసింది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానికంగానే రాయితీపై విత్తనాలు, ఎరువులు, పరుగు మందులు అందజేసింది. వ్యవసాయ అధికారులు, సహాయకుల ద్వారా విత్తు నుంచి పంట విక్రయం వరకు సలహాలు, సూచనలు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది. సాగుకు పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, పంటలు దెబ్బతింటే నష్టపరిహారం అందించి అండగా నిలిచింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్బీకేలను నిర్వీర్యం చేసింది. పెట్టుబడి సాయం చేస్తామని కాలయాపన చేస్తోంది. గత ప్రభుత్వంలో అమలు చేసిన సేవలను గాలికొదిలేసింది.

**అవుకు:** రైతన్నలకు చేయూతనందించేందుకు ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నల కష్టాలను తొలగించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా రైతులకు పంటల సాగు మొదలుకొని, దిగుబడి ఇంటికి చేర్చే వరకు అండగా ఉండేది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్బీకేలలోనే దిగుబడులను కొనుగోలు చేసి రైతుకు తోడ్పాటును అందించింది. అయితే కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి .. రైతులకు కనీస సేవలు అందించకుండా ఇబ్బంది పెడుతోంది.

**మూలనపడిన కియోస్క్ యంత్రాలు**

గత ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులు ఎప్పటికప్పుడు ఎరువులు, పురుగుల మందులు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించింది. అలాగే వాతావరణంలో మార్పులు తెలుసుకుని, అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చింది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా ఈ యంత్రాల ద్వారా రైతులు తెలుసుకునే వారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను మూలన పడేశారు. వీటి ద్వారా రైతులకు అందే సేవలను సైతం నిలిచిపోయినట్లే.





అవుకులోని రైతు సేవా కేంద్రం

**రైతు సంక్షేమ పథకాలు అధోగతి**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అందిస్తూ అండగా నిలిచింది. ఏడాదికి రైతు భరోసా కింద విడతల వారీగా నగదును అందించి పంటల సాగుకు సహాయం చేసింది. సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేసింది. తక్కువ ధరలకే ఎరువులు, పురుగుల మందులను పంపిణీ చేసింది. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు సకాలంలో పరిహారాన్ని అందించింది. ఎన్నికల ముందు కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పథకాలకంటే ఎక్కువగా ఇస్తామని ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ పథకం అమల్లోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక ఖరీఫ్, రబీ సీజన్ పూర్తయి మళ్లీ ఖరీఫ్ సీజన్ వస్తున్నా అన్నదాతకు మాత్రం సుఖీభవ అందలేదు.

| నియోజకవర్గంలో ఇలా.. | |
|---|---|
| మండలం | రైతు సేవా కేంద్రాలు |
| అవుకు | 18 |
| కొలిమిగుండ్ల | 13 |
| సంజామల | 11 |
| బనగానపల్లె | 25 |
| కోవెలకుంట్ల | 10 |

**గతంలో నిత్యం అందుబాటులోనే..**

గతంలో ఆయా ఆర్బీకేల్లో ఉద్యానాధికారి, వ్యవసాయాధికారి, వ్యవసాయ సహాయకులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండేవారు. ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు అందించేవారు. అప్పటి సర్కారు సైతం రైతు భరోసా కేంద్రాల నిర్వహణకు నిధుల సమస్య లేకుండా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సేవా కేంద్రాల నిర్వహణను గాలికి వదిలేసింది.

**భరోసా లేదు**



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న అన్నదాత సుఖీభవ హామీ అమలు చేయలేదు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనం నుంచి ఎరువుల వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేవారు. ఇప్పుడు అక్కడికి ఎప్పుడు వెళ్లినా ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. సరైన సమాధానం లేదు. ఇక సేవల సంగతి సరేసరి. మళ్లీ మాకెప్పుడు మంచి రోజులు వస్తాయో.

–బాల వెంకట సుబ్బయ్య, అవుకు

**అప్పులు పెరిగిపోతున్నాయి**



పెట్టుబడి సాయం అందక, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు పెరిగిపోయాయి. గతంలో ప్రతి సీజన్‌లో పెట్టుబడి సాయం అందేది. గతంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వమే గిట్టుబాటు ధరను కల్పించి ఆదుకునేది. ఇప్పుడు పెట్టుబడి సాయం అందుతుందో లేదో అనే అనుమానం రోజురోజుకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు.

–మంచాల నాగేశ్వరరెడ్డి, సుంకేసుల గ్రామం

### డోన్ తహసీల్దార్‌గా రవికుమార్



**డోన్ టౌన్:** డోన్ తహసీల్దార్‌గా రవికుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న నాగమణిపై పలు ఆరోపణలు రావడంతో సిరివెళ్లకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో చాగలమర్రిలో పనిచేస్తున్న రవి కుమార్ ఇక్కడికి రానున్నారు.

**అవుకు తహసీల్దార్‌గా పుష్పకుమారి**

**అవుకు:** స్థానిక తహసీల్దార్‌గా పుష్పకుమారి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ బాధ్యతలు తీసుకున్న సువర్ణాదేవి కొన్ని కారణాలతో డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న మల్లికార్జున రెడ్డి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం సువర్ణాదేవి ఉయ్యాలవాడకు బదిలీ అయ్యారు. సిరివెళ్లలో పనిచేస్తున్న పుష్పకుమారిని అవుకుకు బదిలీ చేశారు.

**కొలిమిగుండ్లకు శ్రీనివాసులు**

**కొలిమిగుండ్ల:** స్థానిక తహసీల్దార్‌గా ఉయ్యాలవాడలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును జిల్లా కలెక్టర్ శుక్రవారం నియమించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి వారం క్రితం అమరావతి సీసీఎల్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ విశ్వతేజకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బదిలీల్లో భాగంగా ఉయ్యాలవాడ నుంచి శ్రీనివాసులును కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా నియమించారు.



జస్మిత / బి: మనీష / సి: వసంత / డి: పి.అఫ్రిద్ / ఈ: ఎస్.అఫ్రిద్

### ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

**కొలిమిగుండ్ల:** స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎస్.అఫ్రిద్, మనీషా, వసంతలక్ష్మి, జస్మిత, పి.అఫ్రిద్ ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇంటర్మీడియెట్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## దుల్హన్ పథకం అమల్లో జాప్యం తగదు

**ప్యాపిలి:** ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆవాజ్ కమిటీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జలదుర్గం రసూల్, చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జలదుర్గం గ్రామంలో నిర్వహించిన ఆవాజ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే పేద ముస్లిం ఆడపిల్లల వివాహానికి దుల్హన్ పథకం కింద రూ.లక్ష అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా పథకం విధివిధానాలు ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్న ఆశతో పేద ముస్లింలు అప్పులు చేసి తమ కుమార్తెల వివాహాలు జరిపించి ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం షాదీ తోఫా కింద రూ.50 వేలు అందజేసిందని గుర్తు చేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీలను అమలు చేయాలన్నారు. కమిటీ సభ్యులు హుసేన్ వలి, దస్తగిరి, గుండాల్ బాషా, మహమ్మద్, మాబు, మాసుం వలి, అహ్మద్ బాషా, పెద్ద బషీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి





బనగానపల్లెలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్, సంజామల: సూచనలు చేస్తున్న ఎస్‌ఐ రమణయ్య



డోన్‌లో మాట్లాడుతున్న ప్రాంతీయ పశువైద్య సంయుక్త సంచాలకుడు నాగరాజు

**డోన్:** బక్రీద్‌ను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రాంతీయ పశువైద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా ఇతర మతస్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా గోవధకు పాల్పడకూడదని సూచించారు. ఆవులు, దూడలు, ఒంటెలు వధించడం నేరమన్నారు. గోవులను అక్రమంగా రవాణా చేసే వారితో పాటు విక్రయించినా, కొనుగోలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొటేళ్లు, కోళ్లు, మేకలను వధించి స్నేహపూర్వకమైన వాతావరణంలో పర్వదినాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో మతపెద్దలు మౌలానా, మహమ్మద్ బాషా, దర్బేష్‌ఖాన్, లియాజ్, ఇలియాజ్, మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

- **బనగానపల్లె రూరల్:** మతసామరస్యాన్ని చాటేలా బక్రిద్ పండుగను నిర్వహించుకోవాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలో హిందూ, ముస్లింలు ఐకమత్యంగా ఉండాలని, ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.
- **సంజామల:** శాంతియుత వాతావరణంలో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్‌ఐ రమణయ్య అన్నారు. సంజామల పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటలకు తావు లేకుండా ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎవరూ చేయవద్దని పేర్కొన్నారు.
- **బేతంచెర్ల:** త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మండల ఖాజీ నూర్ అహ్మద్ పిలుపునిచ్చారు. బేతంచెర్ల పట్టణంలోని ముస్లింలు కొలుములపల్లె రహదారిలోని ఈద్గా వద్దకు ఉదయం 8 గంటల్లోపు చేరుకోవాలన్నారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం, ఇస్మాయిల్ త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. మండలంలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

### ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**డోన్:** స్థానిక ఆదర్శ పాఠశాలలో వివిధ తరగతుల్లో ఖాళీ అయిన సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కేసీరాజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7, 8, 9 తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు జూన్ 5 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈ నెల 24వ తేదీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25వ తేదీ విడుదల చేస్తామని తెలిపారు. 26వ తేదీ ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

### ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**సంజామల:** స్థానిక ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాలేహా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియాలు ఉనానయని పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### నేడు దేవుని మాన్యం కౌలుకు వేలం

**సంజామల:** మండల పరిధిలోని ఆకుమల్ల చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 65 ఎకరాల మాన్యం భూములకు శనివారం కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాల చెన్నయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### మౌలిక సదుపాయాలపై ఫిర్యాదు చేయండి

**కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల కొరత ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్ నాయుడు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని ఆయా కాలనీల్లో పారిశుద్ధ్యలోపం, తాగునీరు, వీధిదీపాలు, తదితర సమస్యలు తలెత్తితే ఇకపై గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 8008513625, 7981219380 నంబర్లకు ఫోన్ చేసి కాని, వాట్సాప్ ద్వారా సమస్యలను తెలియజేయవచ్చన్నారు. పేరు, కాలనీ, సమస్య వివరాలు తెలియజేస్తే గ్రామ పంచాయతీ పరిధిలో చేయగలిగితే వెంటనే సమస్య పరిష్కరిస్తామని లేని పక్షంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### యువతి అదృశ్యం.. కేసు నమోదు

**అవుకు:** యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. అవుకు మండలం మెట్టుపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(20) ఈ నెల 4వ తేదీ బట్టలు ఉతకడానికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో యువతి తండ్రి రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### 16న జాబ్ మేళా

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, టాలెంట్ వర్క్ టెక్నాజీ కంపెనీ, సుజల పైప్స్, ఓడాఫోన్ ఐడియా, యాక్సిస్‌బ్యాంక్ సహా 10 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 7673902328, 9154830286, naipunyam.ap.gov.in సంప్రదించాలన్నారు.

## స్థాయిని మించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం
- డైవర్షన్ పాలిటిక్స్ మానుకుంటే మంచిదని హితవు

**బనగానపల్లె రూరల్:** కూటమి నాయకులు తమ స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని.. ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పార్టీ మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, అనీల్, మండల కన్వీనర్ జనార్దన్ రెడ్డి, అబ్దుల్‌ఫైజ్, అంబటి రవి కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకులు టంగుటూరి శీనయ్య, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి తదితరులు తమ స్థాయిని మరిచి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని.. ఆ పేరు ఎత్తే అర్హత వారికి లేదన్నారు. గతంలో మల్లికార్జునరెడ్డి సొంత గ్రామం చెన్నపల్లెలో జరిగిన హత్యా కేసులో టీడీపీ నాయకులు కేసు పెట్టేందుకు ప్రయత్నిస్తే కాటసాని రామిరెడ్డి కాపాడిన విషయం మరిచితివా అంటూ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏం అభివృద్ధి జరగలేదంటున్న కూటమి నాయకులకు బనగానపల్లెలో వంద పడకల ఆస్పత్రి, ఫోర్‌లేన్ రోడ్లు, పట్టణంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదా అన్నారు. పచ్చ నేతలకు అంతా పచ్చగానే కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేయడం మంచిది కాదని హితవుపలికారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని.. తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబేనని గతంలో ఎన్టీఆర్ పేర్కొన్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ఆ తర్వాత మాట్లాడితే బాగుంటుందన్నారు.



బోయ ఆదిత్య కృష్ణ,ఇ. మహిత్, పరదేశి వైష్ణవి,లోహిత, సాయి నవ్రత, సయ్యద్ సర్దార్, జీనత్ జోహ

### ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

**బేతంచెర్ల:** గత నెల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఏడుగురు విద్యార్థులను ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ సోమశేఖర్ శుక్రవారం తెలిపారు. ఇందులో బోయ ఆదిత్య కృష్ణ, ఇ. మహిత్, పరదేశి వైష్ణవి, కె.లోహిత, సాయి నమ్రత, సయ్యద్ సర్దార్, సయ్యద్ జీనత్ జోహ ఉన్నట్లు వెల్లడించారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పర్వదినం

**ప్యాపిలి:** ఈద్ ఉల్ ఫితర్ తర్వాత ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఈద్ ఉల్ అధా (బక్రీద్)కు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ నెల 10వ తేదీ జరుపుకునే ఈ పండుగ త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. శనివారం (నేడు) ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. ఈ పండుగ జరుపుకోవడం వెనుక అల్లాహ్ దాసులైన హజరత్ ఇబ్రహీం అలైహివస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహివస్సలాంల త్యాగ నిరతి దాగి ఉంది.

**ఉదయం 8 గంటలకు ఈద్ నమాజ్**

శనివారం ఈద్ నమాజ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ ఖాజీ, హాఫీజ్ మహబూబ్ ఖాన్ తెలిపారు. ఉదయం 7–30 గంటలకు మదరసా నుంచి తక్బీర్ పఠిస్తూ ఈద్గాకు చేరుకోవాలన్నారు. ఈద్గాలో 8 గంటలకు బక్రీద్ ప్రత్యేక ప్రార్థన ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి ముస్లిం సకాలంలో ఈద్గాకు చేరుకుని ఈద్ నమాజ్‌కు హాజరుకావాలన్నారు.

### వివాహ వేడుకలో బుగ్గన

**బేతంచెర్ల:** పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన మల్లు చంద్రశేఖర్ రెడ్డి, సుజాత దంపతుల కుమార్తె ధరణి, తరుణ్ వివాహం కర్నూలులో జరిగింది. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు మద్దిలేటిస్వామి ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, నాయకులు గూని నాగరాజు, రాఘవేంద్రారెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



వధూవరులతో మాజీ మంత్రి బుగ్గన

**మండలానికి 21 గోకులం షెడ్లు మంజూరు**

**బేతంచెర్ల:** మండలానికి ఈ ఏడాది 21 గోకులం షెడ్లు మంజూరైనట్లు వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి శుక్రవారం తెలిపారు. గోకులం షెడ్లు నిర్మించుకోవాలనుకునే రైతులు దరఖాస్తులను సమీపంలోని పశు వైద్యశాల, రైతు సేవా కేంద్రాల్లో ఉన్న పశు వైద్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు బేతంచెర్ల పశు వైద్యశాలలో సంప్రదించాలన్నారు.